# నోటీసులు ఇవ్వకుండా హైడ్రా కూల్చడం అన్యాయం

**-బాధితులు సోనల్, విశాల్**





మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు సోనల్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తమ తాతముత్తాతల నుంచి కాపాడుకుంటు వసున్న ఆస్తులను ఆక్రమణల పేరుతో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హైడ్రా కూల్చివేయడం అన్యాయమని బాధితులు సోనాల్, విశాల్ అరోపించారు. ఈమేరకు శనివారం ఉదయం రసూల్‌పురా సమీపంలోని తారా పాట్నీనగరలో తమ స్థలంలో వారు మీడియాతో మాట్లాడారు. నాలాకు సమీపంలో 500గజాల స్థలంలో ఉన్న తమ హోండా సర్వీర్ సెంటర్ ప్రాంతాన్ని అలాగే దాదాపు 70నుంచి 75ఏళ్ల కింద నిర్మించిన గుడి ప్రాంతాన్ని హైడ్రా బుల్డోజర్లలతో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6గంటలకు వచ్చి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వచ్చి షెడ్‌ను కూల్చివేయడం చేపట్టారని ఆభూమికి కోర్టు స్టేటస్‌కో సైతం ఉందని అయినా అధికారులు వినిపించుకోవడం లేదన్నారు. 1954-55 నుంచే తమకు పట్టా ఓనర్ షిప్ కలిగి ఉన్నామని తమ ఆస్తులను విస్తరణ పేరుతో అధికారులు ఒక్కసారిగా కూల్చివేయడం ఏంటని ప్రశ్నించారు. దీన్ని వల్లతాము సుమారు 45లక్షల విలువైన ఆస్తులను కోల్పోయామని ప్రభుత్వం స్పందించి వెంటనే తమ భూమిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.



# హైదరాబాద్ వార్త

# జూబ్లీహిల్స్‌బరిలో‘కూటమి’ అభ్యర్థి!

**-బరిలో నిలిపేందుకు బిజెపి-టిడిపి సన్నాహాలు -ఏపార్టీ అభ్యర్థిని నిలబెట్టాలనే దానిపై అంతర్గత చర్చ**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణలో జూబ్లీహిల్స్ బైపోల్ పాలిటిక్స్ ఆసక్తిగా మారాయి. ఉప ఎన్నిక జరగడానికి ఆరు నెలల సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ఎన్నికల కోసం పార్టీలు సిద్దం అవుతున్నాయి. సిట్టింగ్ సీటును నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ బీఆర్ఎస్ నుంచి దివంగత నేత మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీత బరిలోకి దిగడం ఖాయమంటున్నారు. భర్త చనిపోయిన సింపతీతో పాటు కమ్మ, ఆంధ్రా సెటిలర్ల ఓట్లు కలిసి వస్తాయని బిఆర్ఎస్ అధిష్టానం అంచనా వేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే రావుల శ్రీధర్‌రెడ్డి, పిజెఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్లను సైతం పరిశీలిసున్నట్లు తెలస్తుంది. అలాగే గ్రేటర్‌లో పట్టు సాధించేందుకు సైతం కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీటును ఉప ఎన్నికలో కైవసం చేసుకున్న కాంగ్రెస్..ఇప్పుడు జూబ్లీహిల్స్ సీటును కూడా ఎలాగైనా గెలుచుకోవాలని ప్లాన్ చేస్తోంది. కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్ సైతం నేను బరిలో ఉంటాని ప్రకటించారు. అలాగే మరో మై నార్టీ నేత ఫిరోజ్‌ఖాన్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీద్దిన్ ,చిన్నశ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్, పిజెఆర్ కుమార్తె విజయారెడ్డి పేర్లను పరిశీలిస్తుంది.

**మేము సైతం..**

ఈనేపథ్యంలోనే బీజేపీ టీడీపీ జనసేన కూటమితో బరిలోకి దిగుతుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లే ఆపార్టీ నుంచి గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన దీపక్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఏపీ సీఎం చంద్రబాబును కలిసినట్లు సమాచారం. అయితే ఈపోటీలో టీడీపీనే బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటివరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ పెద్దగా ప్రభావం చూపింది లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో కాస్తో కూస్తో ఓట్లు సాధించినా అ సెంబ్లీ ఎన్నిక ల్లో మాత్రం పేలవ ప్రదర్శనే చూ పించింది. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా రెండు సార్లు బీజేపీ పోటీ చేస్తే ఒక్కసారి కూడా 25వేల ఓట్లు దాటింది లేదు. అయితే 2014లో టీడీపీ నుంచి పోటీ చేసిన మాగంటి గోపీనాథ్ విజయం సాదించారు. దీనిని అడ్వాంటేజ్‌గా తీసుకుని బరిలో దిగి అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. గోపినాథ్ పార్టీ మారినప్పటికీ టీడీపీ క్యాడర్ బలంగా ఉందన్న నమ్మకం టిడిపిలో ఉంది. దీనికి తోడు ఈ నియోజవర్గంలో కమ్మ, ఆంధ్రా సెటిలర్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఇది టిడిపికి కలిసొస్తుందని దీన్ని అడ్వాంటేజ్‌గా తీసు కుని టీడీపి అభ్య ర్థిని బరిలో నిలిపి జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా తెలంగాణలోనూ తమపార్టీ బలంగానే ఉందన్న సంకేతం ఇవ్వాలన్న యోచనలో టీడీపీ ఉన్నట్టు సమాచారం.

**పోటీచేస్తే అభ్యర్థి ఎవరు ..?**

అయితే టీడీపీ నుంచి ఎవరు బరిలో నిలుస్తారన్నది మరో ప్రశ్న. అయితే 2018 ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి పోటీ చేసి ఓడిపోయిన నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసినిని పోటీకి దింపా లనే ఆలోచన టీడీపీ ఉన్నట్లు ఉన్నట్లు తె లుస్తుంది. 2018 ఎన్నికల్లో సుహాసిని పోటీ చేసి 70వేల 563 ఓట్లను సాధించి కమ్మ సామాజి కవర్గం, ఆంధ్రా సెటిలర్ల మన్ననలను పొందింది అని జూబ్లీహిల్స్‌లో కూడా కమ్మ సామాజిక వర్గం, ఆంధ్ర సెటిలర్లు ఓటర్లు ఎక్కువగా ఉండ టంతో నందమూరి సుహాసినిని బరిలోకి దింపితే కూటమి జూబ్లీహిల్స్‌లో మెరుగైన ఓట్లు సాధిం స్తుందన్న భావనలో టిడిపి ఉన్నట్లు తెలుస్తుంది. అలాగేతన పార్లమెంట్ సీటు పరిధిలో ఉన్న జూబ్లీ హిల్స్ సీటు ఉప ఎన్నికలో టీడీపీ, జనసేన మద్ద తుతో బిజెపి అభ్యర్థిని పెట్టి సత్తా చాటాలనుకుంటున్నారట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈనేపథ్యంలో కూటమి అభ్యర్థిని నెలబెడితే సీటు కేటాయింపు ఎవరికి.? బీజేపీ నుంచి దీపక్‌రెడ్డి బరిలోకి దిగుతారా?టీడీపీ నుంచి సుహాసిని పోటీ చేయబోతున్నారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# యోగాను ప్రతిఒక్కరూ జీవనశైలిలో భాగం చేయాలి

**-జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్**



కెబిఆర్ పార్కులో నిర్వహించిన యోగాడేలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎలాంటి వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో యోగాను భాగం చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం డీఈఓ, డిఎంహెచ్ఓ, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ జాతీయ పార్కులో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు, జీవన శైలిలో సమతుల్యతకు యోగ ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, దినచర్యలో భాగంగా యోగాను భాగం చేసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ...సమాజంలో ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లకుశిక్షణ ఇస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనారోగ్యం బారిన పడకుండా ముందు జాగ్రత్తగా చర్యగా ఆరోగ్య జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఫిషర్మెన్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూజి. ముకుంద రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, డిఈఓ రోహిణి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయి రాం, జిల్లా అధికారులు, ఆశా వర్కర్లు, వైద్యశాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది, యువకు లు తదితరులు పాల్గొన్నారు

# భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

**- ఆలయ పరిసరాలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని**



మహంకాళీ జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట జూన్ 21, ప్రభాతవార్త** మహంకాళీ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. శనివారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయ పరిసరాలలో అధికారులతో కల్సి పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులను అడిగి సమస్యలు తెల్సు కున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. ముందుగా ఆలయం వద్ద పండితులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఆశీర్వచనం అందజేసారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని చెప్పారు. ఆషాడ మాసంలో నిర్వహించే బోనాలు అంటేనే గోల్కొండ ,సికింద్రాబాద్, ఓల్డ్ సిటీ ప్రాంతాలలో ఎంతో సందడి నెలకొంటుందని అన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది నిర్వహించే మహాకాళీ అమ్మ జాతరకు లక్షలాది మంది భక్తులు వస్తారని అన్నారు. తెల్లవారుఝామున 3గంటల నుంచే అమ్మ వారికి బోనాలు సమర్పిస్తారని అన్నారు. ఒక్క హైదరాబాద్ నగరం నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనం కోసం తోపులాట క్యూలైన్లలో వచ్చే భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా తాగు నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. వాటర్ ప్యాకెట్ల పంపిణీకి అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం అదనపు పోలీసు సిబ్బందితో పాటు షీటీమ్‌లను మఫ్టీపోలీసులను నియమించాలని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో రోడ్ల మరమ్మతులు నిర్వహించాలని, టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని, జోగినులు, శివసత్తులకు అమ్మ వారి దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణా ప్రభుత్వం దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు ప్రయివేటు దేవాలయాలకు కూడా ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని ఈ సందర్భంగా తలసాని గుర్తు చేసారు. మహంకాళీ ఆలయానికి ప్రతి సంవత్సరం బోనాల నిర్వహణ కోసం 10లక్షల రూపాయల చొప్పున మంజూరు చేసినట్లు వివరించారు. భక్తులకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న దక్కన్ మానవసేవాసమితి, ఆర్య సమాజ్ తదితర స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు, వ్యాపారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ డాకు నాయక్, ఈఈ సుబ్రమణ్యం, ఆర్అండ్‌బి ఈఈ రవీంద్ర మోహన్, సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్. వాటర్ వర్క్స్ జీఎం వినోద్, ఎలక్ట్రికల్ ఏడీ దుర్గా ప్రసాద్, మహంకాళీ సీఐ పరుశురాం, నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, కిషోర్ విజయ్‌చారి, పబ్బా ప్రకాష్, సంజచ్, మహేష్ యాదవ్, మహేందర్, కోటేశ్వర గౌడ్, సతీష్, సత్యనారాయణ, దక్కన్ మానవ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు మందలించడంతో మైనర్ బాలికలు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న మైనర్ బాలికలు: విచారణ జరుపుతున్న బాలాపూర్ పోలీసులు

**సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన ఇద్దరు మైనర్ బాలికలు ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన వెంకటేశ్, రమణమ్మ దంపతులు జీవనోపాధి కోసం ఇటీవల హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పిఎస్ పరిధిలోనున్న మల్లాపూర్ బాలాజీటౌన్‌షిప్ కాలనీకి వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీరికి వినీల (17), అఖిల (16) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇక్కడికి రాక ముందు ఈ కుటుంబం బెంగుళూరులో నివాసం ఉన్నది. అక్కడ అనుకోని ఘటన జరగడంతో అక్కడి నుండి మల్లాపూర్ బాలాజీ టౌన్‌షిప్‌కు వచ్చారు. తండ్రి ఆర్‌సిఐలో కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తుండగా తల్లి హౌస్ వైఫ్ ఉంటున్నది. అయితే చదువుకుంటూ బుద్ధిగా ఉండాలని తల్లిదండ్రులు చెప్పినా కూతుళ్ళు వినకపోవడంతో వారిని మందలించారు. దీంతో వినీల, అఖిలలు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో కిటికీ రెయిలింగ్‌కు ఉరివేసుకొని బలవర్మణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్కూల్ బస్సు కింద పడి పదేళ్ల బాలుడు మృతి..

**జగద్గిరిగుట్ట, జూన్ 21, ప్రభాతవార్త** పదేళ్ల బాలుడు స్కూల్ బస్సు కింద పడి మృతి చెందిన సంఘటన జగద్గిరి గుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జగద్గిరిగుట్టలోని శివ నగర్‌లో శుక్రవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై సైకిల్ తొక్కుతున్న జషిత్ చౌహాన్(10) ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు కింద పడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కంట్లో పొడిచిన కత్తిని తొలగించిన ఇఎన్‌టి వైద్య బృందం



బాధితుడికి శస్త్రచికిత్స చేస్తున్న ఇఎన్‌టి వైద్యబృందం

**బేగంబజార్, జూన్ 21 ప్రభాతవార్త:** పాత కక్షల కారణంగా ఓ వ్యక్తి మరో వ్యక్తి ఇంట్లో నిద్రిసుండగా తెల్లవారు జామున ఇంట్లో చొరబడి కంటి పై కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. కత్తి కంట్లో చోచ్చుకు పోయింది. ఈసంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోలె గ్రామానికి చెం దిన చెన్నయ్య కుమారుడు జి.రాజేందర్‌పై అదే గ్రామానికి చెందిన ఒవ్యక్తి కత్తితో దాడి చేశారు. కత్తి కంట్లోకిచొచ్చుకు పోయింది. వెంటనే బాధితుడు రాజేందర్‌ను చికిత్స నిమిత్తం ముందుగా గాంధీ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అక్కడి అతనికి వైద్య పరీక్షలు నిర్వహించి, కంట్లో కత్తి చొచ్చుకు పోవడంతో సరోజని కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు కూడా పరీక్షలు నిర్వహించారు. కత్తి కంటి నుంచి ముక్కులో వెళ్లినట్లు నిర్ధారించి కోఠి ఇ.ఎన్.టి ఆసుపత్రికి పంపించారు. ఈనెల 19వ తేదిన కోఠి ఇ.ఎన్.టి ఆసుపత్రికిరావడంతో వెంటనే ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఆనంద చార్య ఆద్వర్యంలో పేషంట్‌కు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్స నిర్వహించారు. కంట్లో పొడిచిన కత్తిని ఆపరేషన్ చేసి కత్తిని తొలగించి ప్రాణాలను కాపాడారు. డాక్టర్ ఆనందచార్య, సరోజని దేవి కంటి ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ మోదిని, అనస్థీషియా డిపార్ట్‌మెంట్ డాక్టర్ రవి, వైద్యులు ఉమాప్రదం, నిఖిల, సౌజన్య, స్వామిలోపాటు నర్సింగ్ విభాగం అంజలి, బాలరాజ్‌లు వైద్యబృందానికి సహాయ సహకారాలను అందించి శస్త్ర చికిత్స విజయవంతం చేసి బాధితుడు రాజేందర్ ప్రాణాలను కాపాడారు. మరోసాటి తమ సాటిలేరని ప్రభుత్వవైద్యులు నిరూపించుకున్నారు

# జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్‌లో “ప్రక్షాళన”

**-13 మంది ఎసిపిలు, 14 మంది సెక్షన్ ఆఫీసర్లకు స్థాన చలనం**

**-పారదర్శకత పెంచడం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో కమిషనర్ చర్యలు**




**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో కమిషనర్ ఆర్వీ కర్ణన్ భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడం, కొందరు అధికారులు ఏసీబీకి చిక్కడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈనిర్ణయం తీసుకున్నారు. మొత్తం 27 మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల్లో భాగంగా 13 మంది అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఏసీపీ), 14 మంది సెక్షన్ ఆఫీసర్లను (ఎస్ఓ) బదిలీ చేశారు. కొన్ని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు, పనితీరు ఆధారంగా కొందరికి పదోన్నతులు కూడా కల్పించారు. మెహిదీపట్నం ఏసీపీగా ఉన్న కృష్ణమూర్తిని ఉప్పల్‌కు, కార్వాన్ ఏసీపీ పావనిని సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. చాంద్రాయణట్ట సెక్షన్ ఆఫీసర్ ఉన్న సుధాకర్‌ను ఏసీపీగా పదోన్నతి కల్పించి అక్కడే నియమించారు. టౌన్ ప్లానింగ్ విభాగం పై ప్రజావాణిలో అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ బదిలీలతో పారదర్శకత పెరిగి, ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు. కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్వయంగా బదిలీ ఉత్తర్వులను అధికారులకు అందజేశారు.

# జీవరాసుల బహుళ శ్రేయస్సుకు దివ్య ఔషధం సంగీతం

**-ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి**



ప్రతిభా పురస్కారగ్రహీతలైన కళాకారులతో రాకేష్‌రెడ్డి, మురళీమోహన్‌రాజు, రామచంద్రరావు, శేఖర్‌రావు తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూన్ 21 ప్రభాతవార్త :** ఈ విశ్వంలోని చరాచర జీవరాసుల బహుళ శ్రేయస్సుల దివ్య ఔషధం సంగీతమన్న తెలంగాణ రాష్ట్ర ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సంగీతం వినడంవల్ల మానసికస్థితి మెరుగుపడుతుందని, ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందని, నొప్పి నివారణకు, జ్ఞాపకశక్తి, దృష్టి వంటి అభిజ్ఞ విధులను పెంచి మెరుగైన నిద్యకు దోహదపడడమేకాక భావేద్వోగ వ్యక్తీకరణ, జీవన నాణ్యతకు శక్తివంతమైన సాధనగా మారుతుందన్నారు. నేడు సంగీతం మాయాజాల ప్రధాన వేదిక,, మానవాళి ఉమ్మడి హృదయస్పందనగా నిలుస్తుందని చెప్పారు. 2025 ప్రపంచ సంగీత దినోత్సవం సామరస్యం ద్వారా స్వస్థత నినాదంతో విశ్వవ్యాప్తంగా జరుపుకుంటున్నామని రాకేష్‌రెడ్డి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రముఖ సంస్థ పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో పినాకిని సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు నేతృత్వంలో వీనులవిందుగా జరిగిన ప్రపంచ సంగీత దినోత్సవం, కళాకారులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన పైడి రాకేష్‌రెడ్డి విశిష్ట అతిథులు పేరాల శేఖర్‌రావు, డా. పి.మురళీ మనోహర్, రామచంద్రరావు, డా. రాధకుసుమ, మహేశ్వరరావు, ఎస్.రామ చంద్రరావు తదితరులతో కలిసి పలువురు ప్రముఖ కళాకారులను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారాలు ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన పలు కళాప్రదర్శనలు, కవిసమ్మేళనం ఆహుతులను అలరించి అబ్బురపరిచాయి.

# కుషాయిగూడ అగ్ని ప్రమాద బాధితులకు రూ 6లక్షల ఎక్స్‌గ్రేషియా

**- చెక్కును అందజేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**




బాధిత కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** అగ్ని ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.6లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును శనివారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు. 16 ఏప్రిల్ 2023న కుషాయిగూడ కట్టెల మండిలో అగ్నిప్రమాదం జరిగి సాయి నగర్ కాలనీలో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పక్కనే నివాసం ఉంటున్న రేట్నేని నరేష్ తన భార్య రేట్నేని సుమ, కుమారుడు రేట్నేని జోషిత్ మరణించిన విషయం విదితమే. బాధిత కుటుంబానికి 6 లక్షల ఎక్స్ గ్రేషియా మంజూరైన నేపథ్యంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు రేట్నేని చెన్నయ్య కు రూ. 6 లక్షల విలువ గల చెక్కును అందజేశారు.

# ఫర్నిచర్ గోదాంలో మంటలు....ఫర్నిచర్ దగ్ధం

**-మంటల్లో చిక్కుకున్న 13 మందిని సురక్షితంగా కాపాడిన ఫైర్ సిబ్బంది**





మంటలలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకొస్తున్న ఫైర్ సిబ్బంది.

**మెహదీపట్నం, జూన్ 21, ప్రభాతవార్త :** నగరవాసులను అగ్ని ప్రమాదాలు వెంటాడుతున్నాయి. ఎక్కడ ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా భారీ ఆస్తి నష్టం తో పాటు ప్రాణ నష్టం జరుగుతుండడంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఆసిఫ్ నగర్ డివిజన్ న్యూ కిషన్ నగర్ లో శనివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రాయలసీ హోటల్ ఎదురుగా ఉన్నటువంటి ఓ ఫర్నిచర్ దుకాణంలో తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధం కావడంతో పాటు మంటలు మొదటి అంతస్తుకు వ్యాపించాయి. ఇది గమ నించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది తో పాటు ఆసిఫ్ నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. 4వ అంతస్తులో చిక్కుకున్న 13 మందిని ఫైర్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## 4వ డివిజన్‌లో రోడ్డు పనులు ప్రారంభం



హన్మంత్‌రెడ్డిని సన్మానించిన స్థానిక ప్రజలు

**నిజాంపేట్, జూన్ 21, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ 4వ డివిజన్ మంజీరా వాటర్ ట్యాంక్ రోడ్ పరిధిలో సీసీ రోడ్ పూర్తిగా పాడు వటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గత నెల సంప్రదించారు. వారి సమ్యసపై స్పందించిన హన్మంత్‌రెడ్డి మున్సిపల్ స్పెషల్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి రూ.20,00,000 రూ మంజూరు చేయించారు. శనివారం మంజూరైన నిధులతో రోడ్డు పనులను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మద్ది నారాయణరెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, సుబ్బు, యుగేంధర్ రెడ్డి, వెంకట్ రావు యాదవ్, శివ కుమార్, మహమూద్, నారాయణ రెడ్డి, చంద్ర, చంద్ర శేఖర్, రమేష్, రామారావు , ఆది, రాజేష్, జగదీష్, నెహ్రూ, పవన్, శ్రీనివాస్, మధు, గోపాల్, రాఘవేంద్ర, గవాస్కర్, మోహన్, రమారవు, శివ మహేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, విజయ్ కుమార్, సందీప్ రెడ్డి, గూడూరు మురళీకృష్ణ, దాసరి మహేష్, జెగ్గా మధుసూదన్ రెడ్డి, సయ్యద్ రఫత్, చిరంజీవి, వీరబాబు గౌడ్, రవీందర్ రెడ్డి, వాసు వరగాని, బికాంక్ష, రమేష్, బలవంత రెడ్డి, (లడ్డు), మల్లికార్జున్, రామచంద్రనాయక్, తులసి దాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టీ గోల్ఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక టోర్నీ

### ఉత్సాహంగా పాల్గొన్న 124మంది గోల్ఫర్లు



పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీ గోల్ఫ్ ఫౌండేషన్, స్టూడియో అనంత సంయుక్తంగా ప్రత్యేక గోల్ఫ్ టోర్నీని నిర్వహించాయి. గచ్చిబౌలీ బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ లో జరిగిన ఈ టోర్నీలో రికార్డు స్థాయిలో 124 మంది గోల్ఫర్లు పాల్గొన్నారు. గ్రాస్ విన్నర్‌గా అనూజ్ మెహతా, బెస్ట్ లేడీ గోల్ఫర్ గా రితికా శాంట్ కేశ్వని, మెంబర్ కేటగిరీ విన్నర్ గా రాజశేఖర్ రాయపరోలు, హ్యాండీక్యాప్ కేటగిరీ 18 విన్నర్ గా టీటీవీఆర్ ప్రసాద్, హ్యాండీ క్యాప్ 19 విన్నర్ గా జేపీ రెడ్డి నిలిచారు. విజేతలకు స్టూడియో అనంత ఫౌండర్ చైతన్య , కో ఫౌండర్ స్రవంతి, బౌల్డర్ హిల్స్ సీఎఫ్ వో మధుసూదన్, జనరల్ మేనేజర్ పాపిరెడ్డి, డీఎస్ఆర్ గ్రూప్ డైరెక్టర్ సాహిత్ రెడ్డి, ఫోకస్ డెంటల్ కేర్ డాక్టర్ అజయ్ కృష్ణ, నైలా ఎయిర్ వాటర్ పార్టనర్ మధుసూదన్ రావు ట్రోఫీలు అందజేశారు. బ్రీత్ అండ్ బిర్డీ పేరుతో నిర్వహించిన యోగా డే టోర్నీకి ఇంత మంచి స్పందన రావడం సంతోషంగా ఉందని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ సీఎఫ్ వో మధుసూదన్ రావు చెప్పారు.

## విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలి

### -ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, జూన్ 21 ప్రభాతవార్త:**

విద్యార్థులు విద్యలో రాణించి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని విద్యానగర్ ఎస్‌విఎస్ స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి ఉచితంగా నోటు పుస్తకాలను అందించారు. డివిజన్ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణి గారు కరస్పాండెంట్ రమేష్, స్థానికబిఆర్ఎస్ నాయకులు కే సురేందర్, అనురాధ, శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్ కుమార్, హరీష్, అబ్బూ,విక్కీ మాధవి ప్రియాంక,పవన్, సత్యనారాయణ,ఖాళీలు, గిరి, నాగ శ్రీ పాల్గొన్నారు. విద్యలో రాణించి పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలన్నారు.

## ఉద్యమకారులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తా : మహేష్‌కుమార్‌గౌడ్



టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి

**చిక్కడపల్లి, మార్చి 23 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తానని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యమకారులకు నెలకు రూ.30వేల ఫింఛన్‌తో పాటు 250 గజాల స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాలను అండగా ఉండాలనే తమ జేఏసీ అభిమతమని అన్నారు. వీటితో పాటు హెల్త్‌కార్డుతో పాటు, ఉచిత బస్సు ప్రయాణం, 100 ఎకరాల్లో స్మృతివనం, సబ్సిడీతో రుణాలు ఇవ్వడంతో పాటు ఇతర అన్ని రంగాల్లో మూడు శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి.తుల్జారెడ్డి, ఎవి.రావు, శంకర్‌రావు, ప్రవీణ్, ప్రసాద్, అంజలి, లావణ్య, సుచరిత, కమలమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



రిటైర్డ్ జడ్జ్ జనార్ధన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవంలో యోగా చేస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



గాజులరామారం డివిజన్ ఆక్సిజన్ పార్కులో యోగా చేస్తున్న రావుల శేషగిరి



సుచిత్ర నారాయణ పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



బౌద్ధనగర్ మెయిన్ రోడ్డు పాత అన్నపూర్ణ మెస్ వద్ద ఏర్పాటు చేసిన యోగాలో కార్యక్రమం పాల్గొన్న డివిజన్ అధ్యక్షులు పి.సాయి ప్రసాద్ గౌడ్, డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ,తదితరులు



యోగా డే సందర్భంగా పికెట్ గార్డెన్‌లో మొక్కలు నాటుతున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, బోర్డు మెంబర్ బానుక నర్మధ,జంపనప్రతాప్, దైవజ్ఞవర్మ తదితరులు





కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకల్లో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్





లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో యోగాలో పాల్గొన్న నేతలు



ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో యోగా చేస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి తదితరులు



ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు



యోగా చేస్తున్న ఆర్.ఆర్.ప్రసాద్ గురూజీ



కార్వాన్ కుల్సుంపుర పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలు



గుడిమల్కాపూర్ బాలాజీ నగర్ కాలనీలో జరిగిన యోగా డే వేడుకలు





సనత్ నగర్‌లోని వెల్ఫేర్ గ్రౌండ్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న పలువురు నేతలు



చికోటి గార్డెన్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజును సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్.



విక్టరీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన యోగలో పాల్గొన్న బిజెపి నాయకులు



హఫీజ్‌పేట్‌లో యోగా దినోత్సవ వేడుకల్లో యోగా చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



పిజేఆర్ స్టేడియంలో యోగా డే సందర్భంగా యోగా గురువులను సత్కరిస్తున్న విద్యార్థులు



మహిళ దక్షత సమితి ఆధ్వర్యంలో యోగా డే పాల్గొన్న డాక్టర్‌సరోజ్ బజాజ్ తదితరులు



దివ్యజ్యోతి స్కూల్‌లో యోగ చేస్తున్న విద్యార్థులు

# నగరంలో ఘనంగా యోగా దినోత్సవం

## నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా, పనులు పూర్తికాలేదు : రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి, జూన్ 21 ప్రభాతవార్త**

నిదులు మంజూరై ఏళ్లగా గడుస్తున్నా అభివృద్ధిపనులను కొనసాగించటంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రజలే తగిన విధంగా బుద్ది చెబుతారని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు యం. రవికుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. హఫీజ్‌పేట్ డివిజన్ బిజెపి నేత అనూష మహేశ్‌యాదవ్ సమక్షంలో, డివిజన్ బిజెపి అధ్యక్షులు జితేందర్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ మంజీరారోడ్డు నుంచి చందానగర్ మునిసిఫల్ కార్యాలయం వరకు ఉన్న ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. నిత్యనరకాన్ని తలపిస్తున్న హఫీజ్‌పేట్, చందానగర్ మంజీరాపైప్‌లైన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ బిజేపీ ఆధ్వర్యంలో నిరసన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వేసవికాలం మొత్తం విశ్రాంతి తీసుకుని బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తు, ప్రజల ఇబ్బందులను గాలికి వదలివేయటం దురదృష్టకరమన్నారు. వర్షాకాలం నెత్తిమీదికి వచ్చిన సమయంలో అధికారులు ఇప్పుడు నిద్ర మత్తు వదలి ఎక్కడ రోడ్డు అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుండటం



చందానగర్-హఫీజ్‌పేట్ మంజీరారోడ్డును వెంటనే నిర్మించాలని నిరసన చేస్తున్న బీజేపీ నేతలు, కార్యకర్తలు

రాక్షసానందమే అవుతుందన్నారు. రోడ్ల మరామ్మత్తు పనులు వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రోడ్ల సమస్యలపై డిప్యూటి కమిషనర్‌కు సమగ్రంగా వినతిపత్రం వ్రాసి, జిహెచ్ఎంసీ కార్యాలయంలో కూడా అందించటం జరిగిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజక వర్గ కన్వీనర్,కో కన్వీనర్,రాష్ట్ర,జిల్లా, డివిజన్, మాజీ ,నూతన అద్యక్షులు, మహిళా మోర్చా, యువ మోర్చా,వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

## 7న ఒంగోలులో 'మాదిగ మహా మేళా

**సైఫాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ గ్రౌండ్‌లో 'మాదిగ మహా మేళా' నిర్వహిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య తెలిపారు. మాదిగ అమర వీరుల త్యాగాల ఫలితంగానే వర్గీకరణ వచ్చిందని ఏ ఒక్కరివల్ల రాలేదని స్పష్టం చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నేతలు ఇటుక రాజుమాదగ, విజయ్‌కుమార్ మాదిగలతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ 30 సంవత్సరాల క్రితం ఈదుమూడి గ్రామంలో ఆవిర్భవించిందని, 7వ తేదీన ఆ గ్రామంలో మాదిగ అమర వీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. ఈ స్థూపం వద్దకు మంద కృష్ణమాదిగ వస్తే ఆహ్వానిస్తామని లేకపోతే మాదిగల ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఒంగోలులో జరిగే మహా మేళాకు మాదిగ సంఘాల నాయకులు, వివధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు పాల్గొంటారని తెలిపారు. మూడు దశాబ్ధాలు పాటు జరిగిన ఎంఆర్‌పిఎస్ ఉద్యమంలో ఆనేక మంది ఆత్మబలి దానాలు చేసుకోగా, ఆనేక మంది జైలుపాలైనారని, ఇంకా చాలా మంది కోర్టుల చుట్టు తిరుగుతున్నారని, వారందరి సహకారంతో వర్గీకరణ సాధ్యమైందని, ఇటు తెలంగాణ ప్రభుత్వం అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వర్గీకరణ చేయడంలో పూర్తిగా సహకరించాయని చెప్పారు. అమరుల కుటుంబాలను రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అదుకోవాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

## క్రీడల్లో సైతం విద్యార్థులను ప్రోత్సహించాలి

### - రాజ్యసభ సభ్యులు డా లక్ష్మణ్

**ముషీరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** విద్యతో పాటు క్రీడలలో సైతం రాణించే విధంగా తల్లితండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్ సూచించారు. ప్రధాన మోదీ 11 సంవత్సరాల పాలనను పురస్కరించుకుని శనివారం సాయంత్రం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఘంటసాల క్రీడా ప్రాంగణంలో షటిల్ బ్యాట్ మెంటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మణ్ హాజరై టోర్నమెంటులో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తూ, క్రీడలకు పెద్ద ఎత్తున బడ్జెట్ కేటాయిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, కార్పొరేటర్‌లు పావని వినయ్‌కుమార్, రచనశ్రీ, బీజేపీ నాయకులు రమేష్‌రాం, రాజశేఖర్, బబ్లూ, బిజ్జి కనకేష్, బొల్లంపల్లి రాంరెడ్డి, సలంద్రి శ్రీనివాసయాదవ్, వెంకటేష్, మహేందర్‌బాబు పాల్గొన్నారు.



## శక్తి స్వరూపిణి విజయదుర్గ అమ్మవారు : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**జీడిమెట్ల, జూన్ 21, ప్రభాతవార్త**

శక్తి స్వరూపిణి విజయదుర్గ అమ్మవారు అని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం 130 సుభాష్ నగర్ డివిజన్ సూరారం మార్కెట్ రోడ్‌లోని శ్రీ విజయ దుర్గా సమేత బంగారు మైసమ్మ దేవాలయం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తి స్వరూపిణి అయిన విజయదుర్గ అమ్మవారిని కొలవడం ద్వారా చేపట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందని అన్నారు. అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు హేమలత సురేష్ రెడ్డి, మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఆఫీసర్ ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, దేవాలయ చైర్మన్ వెంకటస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్, పందిరి యాదగిరి, గుబ్బాల లక్ష్మీనారాయణ, తారా సింగ్, కావలి రవి, వేణు ముదిరాజ్, గట్టు అశోక్, చెక్క సురేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద

## ఘనంగా అవంతి విద్యాసంస్థ ప్లేస్‌మెంట్ సక్సెస్‌మీట్

**హైదరాబాద్ జూన్ 21, ప్రభాతవార్త :**

అవంతి డిగ్రీ పీజీ కాలేజీ ఆధ్వర్యంలో శనివారం 'అచీవర్స్ డే ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్' పేరుతో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభ, కృషి, అవంతి సంస్థ విద్యా ప్రమాణాలపై ప్రతిబింబంగా ఈ వేడుక నిలిచింది. కార్యక్రమం ఆరంభంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.రాకేష్ మనుకా కాలేజీ నివేదికను వినిపించారు. అనంతరం అవంతి విద్యాసంస్థ చైర్మన్, మాజీ మంత్రి మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు.తర్వాత అవంతి పీజీ కాలేజీ, దిల్‌షుఖ్‌నగర్ ప్రిన్సిపాల్ డా.ఎస్. అప్పారావు ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.అవంతి విద్యాసంస్థ డైరెక్టర్ డా.వై.జయప్రద విద్యార్థులను అభినందించారు. అవంతి డిగ్రీ పీజీ కాలేజీ డైరెక్టర్ డా.వెంకటరావు తల్లిదండ్రుల పాత్ర గురించి స్పష్టంగా ప్రస్తావించారు.ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అలీమ్‌ఉద్దీన్ ఎన్నాళ్ళు విద్యార్థులు ఉద్యోగాల్లో ఎంపికయ్యారో,అత్యధికంగా రూ.9 లక్షల వార్షిక వేతనంతో సంస్థ అందించిన ఉద్యోగాల గురించి వివరించారు. గెస్ట్ ఆఫ్ ఆనర్ హాజరైన కంట్రీ హెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవాశిష్ ఘోష్ తాను ఇచ్చిన ప్రేరణాత్మక ఉపన్యాసంలో పరిశ్రమ అవసరాలు,విద్యార్థులు ఎలా భవిష్యత్తులో నాయకులుగా ఎదగాలో వివరించారు. జీవితం కోసం ఒక సూత్రాన్ని కూడా పంచుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె. శశికాంత్ సమగ్ర విద్య పోటీ ప్రపంచంలో దాని ప్రాముఖ్యతపై దృష్టి పెట్టారు. ఇదే కేవలం ముగింపు కాదని, కెరీర్‌లో ఆరంభం మాత్రమే అని అన్నారు. తరువాత బహుమతుల ప్రదానం జరిగింది, ఈ కార్యక్రమం అవంతి విద్యాసంస్థలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, వృత్తిపరమైన అభివృద్ధికి ఎంత ప్రాధాన్యం ఇస్తాయో వెల్లడించింది.



ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్‌లో పాల్గొన్న పొఫెసర్ కె. శశికాంత్,అవంతి శ్రీనివాసరావు,దేవాశిష్ ఘోష్ తదితరులు

## రాష్ట్ర క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కృషి చేయాలి

**చిక్కడపల్లి జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ ఫాస్టర్స్ అసొసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు, వయోవృద్దుల శాఖ మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం ఘనంగా సత్కరించి అభినందించారు. అంతకుముందు క్రైస్తవ మతపెద్దలు ప్రార్ధన చేశారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడు బిషప్ విల్సన్ సింగం, మెదక్ డియోసీస్ వైస్‌చైర్మన్ రెవరెండ్ విన్‌స్టన్, ఎంబి చర్చ్ నుంచి మెన్నో జోయల్, ఎంసిఐ నుంచి సి.బెన్ననోయ్ రిచర్డ్, హెచ్‌బ్రోన్ నుంచి బి. ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారానికి నూతనంగా మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్ నాయకత్వంలో సమసిపోతాయనే ఆశాభావాన్ని గోనె సాల్మన్‌రాజ్ వ్యక్తం చేశారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ ఫాస్టర్స్ అసొసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్

## దోమల నివారణకు పటిష్టమైన చర్యలు

### -కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ



ముసారంబాగ్ డివిజన్ లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,జూన్ 21 , ప్రభాతవార్త:** దోమల నివారణ కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ లోని పలు ప్రాంతాలలో జోనల్ కమిషనర్ వెంకన్న, అడిషనల్ కమిషనర్ పంకజ లతో కలిసి డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి డివిజన్ లోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి డివిజన్ లో చేపడుతున్న పైలెట్ ప్రాజెక్టు వీక్లీ వన్స్ ఫాగింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి డివిజన్లో గతంలో మాదిరిగా ఉన్న విధంగా ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని వీక్లీ వన్స్ ఫ్యాకింగ్ కార్యక్రమాన్ని ప్రజలు స్వాగతించడం లేదని జోనల్ కమిషనర్ వెంకన్న దృష్టికి తీసుకువచ్చారు ముసి పరివాహక ప్రాంతంలో ప్యాకింగ్ అధికంగా అవసరమని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మూసి పరివాహక ప్రాంతం వెంబ డి రిటైనింగ్ వాల్ ని ఏర్పాటు చేయాలని, స్మోక్ ఫాగింగ్ కి బదులు కూల్ ఫాగింగ్ అందుబాటులో తీసుకొస్తే మరీ మంచిదని, దీంతో దోమల నివారణ సులభతరమవుతుందని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నామాల శ్రీనివాస్ రావు, రామారావు, శివ, రాజు, సిబ్బంది దుర్గారావు, గుణప్ప, జగదీష్, నరేష్ ,వంశీ, స్థానికులు ప్రవీణ్, సందీప్, నితీష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యం : డీసీపీ



డిసిపి చైతన్యకుమార్ ని సన్మానిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,జూన్ 21, ప్రభాతవార్త :** శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యమని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్యకుమార్ పేర్కొన్నారు. శనివారం ఉదయం చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పీస్ కమిటీ సీనియర్ సభ్యులు జాఫర్ ఇక్బాల్, కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, చౌకి రవికుమార్ ల ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిసిపి ఎస్ చైతన్య కుమారును ఆయన కార్యాలయంలో కలిసి పుష్ప గుజ్జాలని అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిసిపి చైతన్య కుమార్ మాట్లాడుతూ పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు పీస్ కమిటీ సభ్యులు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నారని కొనియాడారు. పీస్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నూతనంగా వస్తున్న యువకులకు పీస్ కమిటీలో స్థానం కల్పించాలని వారు డిసిపిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీద్ అలీ, చౌకి రాజేష్, మహమ్మద్ సలీం, మహమ్మద్, జానుద్దీన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## మిధాని బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేత



**తుర్కయంజాల్ జూన్ 21 , ప్రభాతవార్త :** బిజెపి మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కడారి శ్రీలత అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మిథానీ డిపో మేనేజర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 293ళీ అనే బస్సు గతంలో ఉమర్ఖాన్ గుడా నుండి ఉమెన్స్ కాలేజ్ ( కోటి) వరకు 293 అనే బస్సు ఉండడం జరిగింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బస్సు యొక్క సర్వీస్ లో నిలిపివేయడం జరిగింది. రైతులు, విద్యార్థులకు ఉద్యోగస్తులకు అలాగే స్థానికంగా నివసించే ప్రజలకు సర్వీస్ లేకపోవడం వల్ల ఉమర్ఖాన్ గూడ నుంచి మళ్ళీ ఎల్బీనగర్ మీదుగా ఇబ్రహీంపట్నం మరియు తుర్కయంజాల్ కు వెళ్లాల్సి వస్తుంది కాబట్టి 293ళీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని మిధాని డిపో మేనేజర్ జగన్ కి వినతిపత్రం ఇచ్చారు.సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని లేనిపక్షంలో స్థానికులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని డిపో మేనేజర్ ను హెచ్చరించారు.అదేవిధంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చెన్నోజు శ్రీకాంతాచారి, తుళ్ల శంకరయ్య గౌడ్, నల్ల మల్లారెడ్డి, బండారు దానయ్య, పండుగల రాము, పుట్టల దీక్షిత్ స్థానిక నాయకులు పాల్గొన్నారు

## ఒకమార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమం



కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ బి.యన్.రెడ్డి, గణేష్ నగర్ కాలనీవాసులు తదితరులు

**బోడుప్పల్, జూన్ 21 ప్రభాతవార్త ;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు మునిసిపల్ శాఖ ప్రతిష్టత్మాకముగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా " ఒకమార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమం " బోడుప్పల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని చెంగిచెర్ల గణేష్ నగర్ కాలనీ కమిటీ హాల్ వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్బంగా కొత్త రవి గౌడ్ మాట్లాడుతూ ....2 వ డివిజన్లో అభివృద్ధి పనులలైన సిసి రోడ్లు, డ్రైనేజీ, త్రాగునిరు, వీధి కుక్కలు నియంత్రణ కార్యక్రమం ఇతర సమస్యలు ఎమైన ఉంటే 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం ద్వారా మా దృష్టికి తేవాలని డివిజన్ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవలని కోరడమైనది. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సానిటేషన్ ఇన్స్పెక్టర్ బి.ఎన్.రెడ్డి, వార్డ్ ఆఫీసర్ భాషా నాయక్ ,గణేష్ నగర్ కాలనీవాసులు,మహిళలు,మున్సిపల్ అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు



అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ప్రియదర్శిని పార్కులో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా సైదాబాద్‌లో యోగాసనాలు వేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి



తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కమ్మగూడ శ్రీ శ్రీ నగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య స్కూల్ విద్యార్థులు



ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జోహార్ నగర్ కో ఆప్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమానికి హాజరైన డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ నారాయణ శ్రీనివాస్ రెడ్డి మల్లేష్ గౌడ్ ప్రసాద్ బాబు సత్యనారాయణ సంపత్ రావు పల్లె విజయ్ కుమార్, అసోసియేషన్ సభ్యులు




హయత్ నగర్ లోని కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న 14వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు ఇంచార్జ్ మేజిస్ట్రేట్ గోపిక నాగశ్రావ్య



బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని ఏ. పి.ఆర్.క్రిస్టల్ అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్టల్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న యోగా నిపుణులు కె.అనిల్ కుమార్,ఉమ, మాధవి,పి.వి.వి.సత్యనారాయణ, అశోక్



ఎచ్.ఎం. డి. ఏ.పార్కు లో పతంజలి యోగా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న ఎల్. బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,గురువు శ్రీనివాస్ బి.జె.పి.ఎల్. బి.నగర్ ఇంఛార్జి సామ రంగారెడ్డి, తదితరులు



బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని ఎన్. జి.వోస్ కాలనీలో గల రాజీవ్ గాంధీ పార్కు లో నిర్వహించిన కార్యక్రమంలో యోగా చేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు.



ఆర్కేపురం భాష్యం హైస్కూల్లో యోగ విన్యాసాలు చేస్తున్న చైతన్య, అంకమ్మరావు, విద్యార్థులు




కొత్తపేట డివిజన్ బిజెపి కార్యాలయంలో జాతీయ యోగ దినోత్సవం సందర్భంగాయోగా గురువు చౌహాన్‌యాష్‌ను సన్మానిస్తున్న యష్పాల్‌గౌడ్




మీర్‌పేట్ నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో విద్యార్థులచే యోగా సాధన చేయిస్తున్న మీర్‌పేట్ నారాయణ ప్రిన్సిపాల్ బాబ్జి తదితరులు



టికెఆర్ కాలేజీలో భారతీయ యోగా సంస్థాన్ శిక్షకుడు ధ్యాసాని సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా సాధన చేస్తున్న మహిళలు, యోగాభ్యాసకులు



యోగా దినోత్సవంను పురస్కరించుకొని నేరేడుమేట్ పరిధిలోని కాకతీయనగర్ సీనియర్ సిటిజన్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం వెస్ట్ కాకతీయనగర్ సంక్షేమ సంఘ కార్యాలయ ఆవరణలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించిన దృశ్యం



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బాలాపూర్ జడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యోగా సాధన చేస్తున్న బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

## సింగరేణి గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలి : మాజీ ఎంపి అజీజ్ పాషా

**సైదాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** సైదాబాద్ మండల పరిధిలోని సింగరేణి కాలనీలో గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలకు గుడిసెలు ఉన్న స్థలంలోనే పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యుడు అజీజ్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారా సేవాసంఘం అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం గెడిసెవాసులు పెద్ద ఎత్తున సైదాబాద్ మండల కార్యాలయం వద్దకు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అజీజ్ పాషా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సింగరేణి గుడిసెల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన పేద ప్రజలు నివసిస్తున్నారని, వీరికి ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఉన్నాయని, గుడిసెలు ఉన్న ప్రాంతం మొత్తం అర్బన్ సీలింగ్ ల్యాండ్ అని అన్నారు. ఇప్పటి వరకు అన్ని ప్రభుత్వాలు గుడిసెవాసులను మోసం చేస్తున్నాయని, ఎన్నికల సమయంలో గుడిసెవాసులకు పట్టాలు ఇస్తామని చెబుతూ ఆ తర్వాత మొండిచెయ్యి చూపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. గుడిసెవాసులకు కనీస అవసరాలయిన త్రాగునీరు, కరెంటు, డ్రైనేజీ, వీదీ దీపాలు వంటి వాటిని కల్పించాలని సుప్రీం కోర్టు కూడా సూచించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే సింగరేణి గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలని అజీజ్‌పాషా, శంకర్ నాయక్‌లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్ అధ్యక్షుడు ఎ.రామ్మూర్తి నాయక్, టిజిఎస్ గౌరవాధ్యక్షుడు , సిపిఐ నాయకులు ఆర్.శంకర్ నాయక్, టిజిఎస్ నగర అధ్యక్షుడు రూప్ సింగ్, టిజిఎస్ ప్రధాన కార్యదర్శి హరినాయక్, సక్రిభాయి, సిపిఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, అంజయ్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



తహాశీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపి అజీజ్ పాషా, సిపిఐ నాయకులు శంకర్ నాయక్

## మాతృభాషతో సహా ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యత ఎంతో అవసరం

### - జూనియర్ సివిల్ జడ్జి అరీష నుస్రత్

**మలక్ పేట, జూన్ 21, ప్రభాతవార్త:** పోటీయుగంలో తమ లక్ష్యలను చేరేందుకు మాతృభాషతో సహా ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యత ఎంతో అవసరమని నూతనంగా ఎంపికైన జూనియర్ సివిల్ జడ్జి అరీష నుస్రత్ అన్నారు. విద్యార్థినుల ఉజ్వల భవిష్యత్తుపై శనివారం మలక్పేట్ లోని డాన్ హైస్కూల్లో జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పురుషాధిక్య సమాజం ఉన్నప్పటికీ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండటం ఎంతో గర్వకారణం అన్నారు. బాలురుల కంటే బాలికలే పట్టుదలతో శిఖరాగ్రాలను చేరేందుకు అహర్నిశలు పోటీ పడుతున్నారని ఆమె కొనియాడారు. తాను ఢిల్లీకి చెందినప్పటికీని తెలంగాణ జ్యుడీషరీ సర్వీసెస్ పరీక్షకు ప్రతిష్టాత్మకంగా తెలుగును నేర్చుకొని లక్ష్యాన్ని సాధించానని ఆమె సగర్వంగా చెప్పారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి తమ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని తాము చదువుతున్న తరగతుల్లోనూ పాఠ్యాంశాలను నిరంతరం అకుంఠిత దీక్షతో చదవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చేసే నిరంతర ప్రయాసాలు ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతాయనే గట్టి నమ్మకాన్ని ఆమె వ్యక్తం చేశారు. పోటీ పరీక్షలకు పేదరికం ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డు రాదని ఆమె వెల్లడించారు. న్యాయవ్యవస్థలో ఉన్నత సేవలను అందించేందుకు మహిళలు న్యాయవాదులు, జడ్జీలు కావలసిన అవసరం ఎంతో ఉందని ఆమె పేర్కొన్నారు. అమ్మాయిలపై తక్కువ అంచనా వేయకుండా తల్లిదండ్రులు పురాతన అపోహలను వీడనాడి ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. జ్ఞాన సంపదను పొందేందుకు మొబైల్ ఫోన్ కాకుండా వార్తా పత్రికలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతో సహా పలు పుస్తకాలను నిరంతరం అధ్యయనం చేయాలని ఆమె కోరారు. తమ చుట్టూ జరిగే నేరాలుఘోరాలను పట్టించుకోకుండా, నాసా, ఇస్రో తదితర సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలపై అధ్యయనం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రం, షజియుల్లా ఫిరాసత్, డాన్ హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న జూనియర్ సినిల్ జడ్జి అరిష నుస్రత్

## బోనాల నేపథ్యంలో గ్రామ దేవతల ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం వినతి

**సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** త్వరలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గ్రామాల్లో బోనాల పండుగలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కార్పొరేషన్‌లోని అన్ని గ్రామ దేవతల ఆలయాల వద్ద ఏర్పాట్ల కోసం ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన నిధులను కేటాయించాలని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డిలు కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం వారు కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్ సరస్వతిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లో ఆషాఢ, శ్రావణ మాస బోనాలు గ్రామాల్లో జరుగుతాయనీ ఈ నేపథ్యంలో గ్రామ దేవతల ఆలయాలకు వెళ్లే రహదారులను భక్తుల కోసం ముఖ్యంగా మహిళల బోనాల ఊరేగింపు కోసం సౌకర్యవంతంగా ఉండేందుకు మరమ్మతులు చేయించాలని కోరారు. అదే విధంగా ఆలయాల వద్ద పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చేయించి వీధి లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. అయితే తమ వినతికి స్పందించిన కమీషనర్ సరస్వతి బోనాల ముందస్తు ఏర్పాట్లు చేయిస్తానని హామీనిచ్చారని గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డిలు తెలిపారు.



కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి

## స్ట్రీట్ వెండర్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్ ప్రారంభం

**సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను కార్పొరేషన్ కమీషనర్ సరస్వతి ప్రారంభించారు. అనంతరం ఆమె స్టాల్‌లోని ఆహార పదార్థాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం : కార్పొరేటర్



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి

**సైదాబాద్, జూన్ 21 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిటవరమని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సాయినగర్ కాలనీకి చెందిన మల్లేష్ బ్రెయిన్ స్ట్రోక్ సమస్యతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.60 వేలు మంజూరయ్యాయి. సదరు చెక్కును శనివారం వార్డు కార్యాలయంలో మల్లేష్‌కు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.కార్యక్రమంలో కందికంటి శ్రీధర్ గౌడ్, పలుసం శ్రీధర్‌గౌడ్, ఉపేందర్ గౌడ్, నరేష్, చందు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**మల్కాజిగిరి జూన్ 21, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా మల్కాజ్ గిరి చౌరస్తాలో ఉద్యమకారులు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు నాయకులు రితిది వెంకన్న తిరీ. మురుగేష్ ఉపేందర్. రామచెర్ల నర్సింగ్. ఖలీల్. సిద్ది రాములు. కృష్ణ గౌడ్..లీ నర్సింగ్. బాబురావు. సైదులు.. కృష్ణ.. ఉస్మాన్. బిక్షపతి. వెంకటేష్. జనార్ధన్. నవీన్. శ్రీకాంత్. మురళి. విష్ణు. సాయి గౌడ్ సుమన్.. అనిల్.. వినీత్. మధు .విజయ్ .రాజేష్ .బాలు. వాసు.. తదితరు నాయకులు పాల్గొన్నారు

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరవింద్‌శర్మ, సునీతరెడ్డి, నగేష్

**ఎల్.బి.నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమస్ఫూర్తిప్రదాత ఆచార్య జయశంకర్‌సార్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో ఆర్కెపురం డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితం మొత్తం తెలంగాణకే అంకితం చేశారన్నారు. పుట్టకనాది బతుకుఅంత తెలంగాణ కొరకు అని చాటి చెప్పిన మహనీయుడన్నారు. కెసిఆర్ పదేండ్ల పాలన జయశంకర్ ఆశలకనుగుణంగా కొనసాగిందన్నారు. ఇంటర్మీడియట్ చదివే రోజుల్లోనే జై తెలంగాణ నినాదం చేసి తరగతి గది నుండి బహిష్కరింపబడ్డాడన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం మహిళా విభాగం టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, వెంకటేష్‌గౌడ్, ముచ్చింతల జగన్, మురళీధర్‌రెడ్డి, వీరస్వామి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నందిహిల్స్‌లో ఆచార్య జయశంకర్ సార్ వర్ధంతి



జయశంకర్ సార్‌కు నివాళులర్పిస్తున్న రజాక్, సునీత తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 21 ప్రభాతవార్త:** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య స్వర్గీయ జయశంకర్ సార్ వర్ధంతిని శనివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నంది హిల్స్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎం.ఎ.రజాక్, బిఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్‌లు జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పదవ డివిజన్ బిఆర్ఎస్ ఇంఛార్జి జగాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు హేము నాయక్, బాలరాజ్ పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ



**మల్కాజిగిరి జూన్ 21, ప్రభాతవార్త** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిరజాలగూడ చిన్మయ స్కూల్ మార్క్ లో పార్కు స్థలం కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని మిర్యాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ప్రహరీ గోడ మరియు గేట్ నిర్మాణానికి 14 లక్షలు సాంక్షన్ చేయించారు. శనివారం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ కాలనీ అభివృద్ధికి సహకరించిన మైనంపల్లి హనుమంతరావు గారికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్, దానియేలు, రామ్ నాథ్, కమిటీ సభ్యులు రమేష్, శ్రీనివాస్, బాలోజీ,శ్రీరామ్ యాదవ్,ఆరోక్య స్వామి, అఖిల్, మల్లికార్జున్, మోహిత్,కాలనీ వాసులు మాధవి, సురేందర్, చిన్ని కృష్ణ, మల్లేష్, ముఖేష్, రాహుల్, పాల్గొన్నారు

## అనారోగ్యంతో మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**నేరెడ్ మెట్, జూన్ 21,ప్రభాతవార్త :** రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆలేరు పోలీస్ స్టేషన్ లో పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ నర్సింగ రావు కుటుంబ సభ్యులకు రాచకొండ కమిషనర్ తన నేరెడ్మెట్ కార్యాలయం నందు భద్రత చెక్కులు అందజేయడం జరిగింది. నర్సింగ రావు భార్య విజయలక్ష్మి కి 5 లక్షల ఎనభై తొమ్మిది వేల రెండు వందల తొంభై, కూతురు వరలక్ష్మి కి రెండు లక్షల రూపాయల చెక్ లను భద్రత నుండి ఇవ్వడం జరిగింది. సిపి సుదీర్ బాబు వారి యోగ క్షేమములు తెలుసుకొని వారికి రావాల్సిన పెన్షన్ తొందరగా వచ్చే విదంగా తగు చర్యలు తీసుకోవాలని మినిస్టిరియల్ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో రాచకొండ అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివకుమార్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రా రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.